# క్రైస్తవ సంకీర్తనాచార్యుడు పురుషోత్తమ చౌధరి

(ఆంధ్రప్రభ ప్రతినిధి)

విశాఖపట్నం, జూన్ 23: ఆంధ్రక్రైస్తవలోకానికి ఆయన ఒక అన్నమయ్య. మరో త్యాగరాజు. ఇంకొక క్షేత్రయ్య. నూట ఏభై ఏళ్లకిందట ఆయన విరచించిన క్రైస్తవ పదకవితలు నేటికీ నిత్యనూతనమై అలరారుతూనే ఉన్నాయి. సంగీత, సాహిత్య, భక్తి రసాల సమలంకృతుడైన ఆయన పేరు పురుషోత్తమ చౌధరి. పుట్టింది ఒరిస్సా, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దుల్లోని పర్లాకిమిడి. మరుగున పడిన ఈ క్రైస్తవ వాగ్గేయకారుడి వివరాలను భావితరాలకు అందివ్వాలన్న బృహత్ ప్రయత్నం విశాఖ వాకిట నేడు జరుగుతోంది. ఆయన ద్విశత జయంతి ఉత్సవాలను ఇక్కడ నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఒక సమితి కూడా ఏర్పాటయింది.



ఆంధ్రక్రైస్తవ కవిసార్వభౌముడిగా వినుతికెక్కిన పురుషోత్తమ చౌధరి క్రీస్తు బోధనలకు ఆకర్షితులై క్రైస్తవం వైపు మరలివెళ్లారు. భక్తిసంగీతం ఆయనకు ఆరోప్రాణమైంది. తెలుగుభాష కరతలామలకం కావడంతో ఆయన పదాలు మధుర మనోహరంగా విరాజిల్లాయి. ఏసుతో మమేకమైన ఆయన చిన్ననాటనే సిద్ధిపొందారు. భక్తి, సాహిత్యం,సంగీతాలు కలగలిసి సుందర,సుమధుర కీర్తనలై చౌధరి మది లోతుల్లోంచి పొంగివచ్చాయి. వీటికాయన కర్నాటక సంగీతపు రాగాలను అందంగా అద్దారు. ఇందువల్లే సుస్వరాల మేళకర్తగా ఆయన క్రైస్తవులలో గుర్తింపునకు నోచుకున్నారు. శంకరాభరణం, కళ్యాణి, మోహన తదితర రాగాలతో ఆయన క్రీస్తుకు చేసిన స్వరార్చన అనితర సాధ్యం.

1803 సెప్టెంబర్ 5న జన్మించిన పురుషోత్తమ చౌధరి భక్తి సంగీతాన్ని అందివ్వడం , లెక్కకు మిక్కిలిగా కీర్తనలు రచించడం ఒక ఎత్తయితే ఆయన అప్పటికాలంలో ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులు మరో ఎత్తు. అన్ని వైపుల నుంచి వస్తున్న అవరోధాలను ఆయన గుండె ధైర్యంతో ఎదుర్కొన్నారు. తాము నమ్మిన ధ్యేయం వైపు, నమ్ముకున్న దేవునివైపు పయనించారు. ఒక కీర్తనలో 'విసిగించే అంతగా భగవంతుని స్మతించు' అని ఆయన పేర్కొనడాన్ని బట్టి దేవుడితో పెనవేసుకున్న ఆయన ప్రేమపాశం ఎంతటి బలీయమైనదో అవగతమవుతుంది.

పురుషోత్తమ చౌధరిని గురించిన కొన్ని రచనలు తెలుగులో ఇప్పటికే వెలువడ్డాయి. ఆయన భక్తి తత్వంపై సుధారత్నాంజలి అనే ఆమె పరిశోధన జరిపి డాక్టరేట్ పొందారు. పాతవారికి పురుషోత్తమ చౌధరి జీవిత చరిత్ర, ఇతర వివరాలు కొద్దిపాటిగా తెలిసినా నేటి తరానికి అనన్య సామాన్యమైన ఆయన వ్యక్తిత్వం, క్రైస్తవ సాహిత్య, సంగీత రంగాలకు ఆయన బహుముఖంగా అందించిన సేవలు పెద్దగా అందిరావడం లేదు. ఇందువల్లే నగరంలోని క్రైస్తవ సంఘాలు ఈ విషయమై దృష్టి సారించాయి. ఎనభై ఏడు సంవత్సరాల చౌధరి సుదీర్ఘ జీవనయానంలో ఎదుర్కొన్న సంఘటనలను గుదిగుచ్చి ఇప్పటివారికి చెప్పాలని సంకల్పించాయి. 2003 సంవత్సరం ఆయన ద్విశత జయంతివత్సరం. విశాఖలో పురుషోత్తమ చౌధరి ద్విశత జయంతి మహోత్సవ సమితి నెలకొంది.

సమితి ఆధ్వర్యాన నగరంలో ఈ నెల 26,27 తేదీల్లో చౌధరి జయంత్యుత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. తొలిరాజు పాటల పోటీలు నిర్వహిస్తున్నారు. 27న ఉత్సవాల ముగింపు సభ నిర్వహిస్తారు. స్థానిక కళాభారతి ఆడిటోరియమ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ఆయనపై పరిశోధన జరిపిన సుధారత్నాంజలి-గారిని, చౌధరి సంకీర్తలను సేకరించిన బి.డి.పి.రావును, ఆయన కీర్తనలకు సంగీతం సమకూర్చిన కె.ఎస్.చంద్రశేఖర్‌ను సన్మానిస్తారు. ఈ సందర్భంగా ఆయన కీర్తనలను పలువురు గాయకులు ఆలపిస్తారు. డాక్టర్ డి.వి.డేనియల్ ప్రసంగిస్తారు. పాటల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుంది.

పురుషోత్తమ చౌధరి జీవితానికి సంబంధించిన వివరాలు తెలిసినవారెవరయినా వాటిని తమకు అందివ్వగలిగితే ఈ సమాచారాన్ని పదుగురికీ పంచేందుకు ప్రయత్నిస్తామని, ద్విశత జయంతి సమితి చైర్మన్ డాక్టర్ ఎన్.జయకుమార్‌రావు తెలిపారు. 'ఆంధ్రప్రభ'తో ఆయన మాట్లాడుతూ గొప్పవారి జీవితాలు స్ఫూర్తిదాయకాలని,వీటిని భావితరాలకు అందివ్వడం అందరి కర్తవ్యమని పేర్కొన్నారు.